


తొలి తెలుగు విశ్వవిద్యాలయ వారపత్రిక

# నన్నయ వాణి

ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం, రాజమహేంద్రవరం - ఆంధ్రప్రదేశ్

www. aknu.edu.in
nannayavani@aknu.edu.in
nannayanewstv
adikavi Nannaya University
9701293231

గౌరవ సంపాదకులు
ఆచార్య మొక్కా జగన్నాథరావు
ఉపకులపతి

ప్రధాన సంపాదకులు
ఆచార్య తుపాకుల అశోక్
కులసచివులు

సంపాదకులు
డా.తలారి వాసు — సహాయాచార్య, తెలుగు శాఖ
పువ్వల ఆనంద్ — ప్రజా సంబంధాల అధికారి, కోఆర్డినేటర్, మీడియా సెల్

సంపుటి : 1 | సంచిక :31 | 17-05-2021 | పుటలు : 4




## జగద్గురు శ్రీ శంకర భగవత్పాదులు

**మే 17 శ్రీ శంకర జయంతి**

అద్వైత వేదాంతానందమూర్తి శంకరాచార్య స్వామి. ఆయనొక శివానంద సాగరం. శివానందలహరి, సౌందర్యలహరి, కనకధారా స్తవం, భజగోవింద శ్లోకాలు, వివేక చూడామణి... ఇలా అద్భుతమైనది ఆయన సాహిత్యం. శంకరుల అద్వైత బోధలు మానవాళికి ఆదర్శప్రాయమైనవి. ఐక్యతకు సరైన నిర్వచనం ఇచ్చిన మేధావి. ఒకరినొకరు అర్థం చేసుకునే విధంగా అన్ని రంగాల్లోనూ సమన్వయం చేయగలది శంకరుల అద్వైత సందేశం.


- నన్నయ వాణి

# మానవతాదృక్పథంతో సేవలందించాలి

**వీసీ ఆచార్య మొక్కా జగన్నాథరావు**

12.05.21 (మీడియాసెల్)

కోవిడ్ పరిస్థితుల్లో బహుళ వికలాంగుల మానసిక, శారీరక శ్రేయసు కొరకు మానవతాదృక్పథంతో, విలువలతో సేవలు అందించాలని, విద్యావంతులు, సేవాసంస్థలు, సైకాలజిస్టులు దీనిలో కీలకపాత్రను పోషించాలని వీసీ ఆచార్య మొక్కా జగన్నాథరావు అన్నారు. ఆదికవి నన్నయ యూనివర్సిటీ డిపార్ట్మెంట్ ఆఫ్ సైకాలజీ, నేషనల్ ఇనిస్టిట్యూట్ ఫర్ ఎంపవర్మెంట్ ఆఫ్ పర్సన్స్ విత్ మల్టిపుల్ డిసేబిలిటీస్ (దివ్యంగజన్) ఎన్ఐఇపిఎండి, సామాజిక న్యాయం మరియు సాధికారత మంత్రిత్వ శాఖ, సంయుక్త ఆధ్వర్యంలో 'వికలాంగుల పునరావాసంపై పరిశోధన' అనే అంశంపై రెండు రోజుల జాతీయ సిఆర్ఇ వెబినార్‌ను నిర్వహించారు. దీనికి కన్వీనర్‌గా సైకాలజీ విభాగాధ్యాపకురాలు సిహెచ్. మణిరమణ కోఆర్డినేటర్లుగా డాక్టర్ పి.కామరాజు, ఠాకూర్ హరీష్‌లు వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా వీసీ ఆచార్య మొక్కా జగన్నాథరావు హాజరై వికలాంగుల పునరావసంపై లోతైన పరిశోధనలు




సమావేశంలో మాట్లాడుతున్న వీసీ జగన్నాథరావు

చేయాలని అన్నారు. సైకాలజీ, సోషల్‌వర్క్ వంటి విభాగాల అధ్యాపకులు, పరిశోధకులు, విద్యార్థులు మరియు విద్యావేత్తలు స్వచ్ఛంద సంస్థలు దీనిలో చురుగ్గా వ్యవహరించాలన్నారు. సేవా కార్యక్రమాలను త్రికరణశుద్ధిగా నిర్వహించాలని తద్వారా ఆత్మసంతృప్తి కలుగుతుందని తెలిపారు. సేవ చేస్తున్నామనే భావనతో గర్వించడం సరికాదని నిరాడంబరంగా సేవలు అందించాలని పేర్కొన్నారు. మానవతాదృక్పథంతో సేవలందిస్తున్న వారిని ప్రశంసించారు. తరువాత ఎన్ఐఇపిఎండి డైరెక్టర్ నచ్చికేత రౌత్ మాట్లాడుతూ ఫ్లోరెన్స్ నైటింగేలు చాలా సంవత్సరల క్రితమే తన పరిశోధనలు చేస్తున్నప్పుడు డాక్టర్స్ హ్యాండ్ వాషింగ్ ఆవస్యకతను గుర్తించి ఆచరణకు నాంది పలికారని తెలియజేశారు. ఆ స్ఫూర్తితో మానవ ఉపయుక్త పరిశోధనల దిశగా కృషి చేయాలని వివరించారు. ఈ వెబినార్‌కు సహకరించిన జాతీయ బహుళ వైకల్యాలున్న వ్యక్తుల సాధికారత సంస్థ, సహాయ్ మానసిక వికలాంగుల సంస్థ, ఠాహూర్ వి.హరిప్రసాద్ ఇనిస్టిట్యూట్ అండ్ స్పృహ అలుమ్ని అసోసియేషన్ ను రిజిస్ట్రార్ ఆచార్య టి.అశోక్ అభినందించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఆచార్య ఎస్.టేకి, సైకాలజీ విభాగాధిపతి డా.పి.రాజశేఖర్, డా.సి.వి.ఎస్. మణిరమణ, సిహెచ్.ఎన్.కె.భవాని, డా.ఎన్.వి.వి.ఎస్.నారాయణ, వెబినార్ చైర్ పర్సన్స్ స్పృహ సైకాలజీస్ట్‌లు సుంకర నాగేంద్ర కిషోర్, ఎస్.రాజేష్ ఖన్నా, ఠాకూర్ హరి ప్రసాద్ ఇన్స్టిట్యూట్ హరీష్, రేవతిలు, చేయూత సంస్థ కృష్ణ కుమారి, అన్నవరం తదితరులు పాల్గొన్నారు.




**రంజాన్ శుభాకాంక్షలు!!**

- నన్నయవాణి

# 19న కోవిడ్-19పై నేషనల్ వెబినార్

## ఆన్‌లైన్‌లో బ్రోచర్ ఆవిష్కరించిన వీసీ

15.05.21 (మీడియాసెల్)

ఈనెల 19వ తేదీన కోవిడ్-19 చికిత్స మరియు సందేహాలు నివృత్తి అనే అంశంపై నేషనల్ వెబినార్‌ను నిర్వహిస్తున్నామని ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం ఆచార్య మొక్క జగన్నాథరావు తెలిపారు. శనివారం విశ్వవిద్యాలయం నుండి ఆన్‌లైన్ ద్వారా బ్రోచర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం మీడియా సెల్ మరియు ఇండియన్ మెడికల్ అసోసియేషన్ రాజమహేంద్రవరం సంయుక్త ఆధ్వర్యంలో కోవిడ్-19 చికిత్స, సందేహాల నివృత్తి అనే అంశంపై నేషనల్ వెబినార్ నిర్వహిస్తున్నామని అన్నారు. దీనికి కన్వీనర్‌గా నన్నయవాణి ఎడిటర్స్ డా.తలారి వాసు, పి.ఆర్.ఓ పువ్వల ఆనంద్ వ్యవహరిస్తున్నారని తెలిపారు. సభాధ్యక్షులుగా రిజిస్ట్రార్ ఆచార్య తుపాకుల అశోక్, ఆత్మీయ సందేశాన్ని ఇండియన్ మెడికల్ అసోసియేషన్ రాజమహేంద్రవరం ప్రెసిడెంట్ ప్రముఖ గుండె వైద్య నిపుణులు డాక్టర్ ఎన్.ఎస్.రామరాజు అందిస్తారన్నారు. కోవిడ్‌కు హాస్పిటల్‌లో అందించే చికిత్స విధానాలు, కోవిడ్ తీవ్రతతో శరీరానికి అవసరమైన ఆక్సిజన్ అందకపోవడం వంటి కారణాలు మరియు ఆక్సిజన్ అందేవిధంగా తీసుకోవాల్సిన మెలకువలు, ఆయా సందేహాలను నివృత్తి చేసేందుకు జి.ఎస్.ఎల్ హాస్పిటల్ అండ్ మెడికల్ కాలేజ్ ప్రొఫెసర్, సర్జన్, చైర్మన్ డాక్టర్ గన్ని భాస్కరరావు కీలక ఉపన్యాసం చేస్తారని చెప్పారు. అలాగే హోమ్ ఐసోలేషన్‌లో ఉన్నవారు తీసుకోవలసిన జాగ్రత్తలు కోవిడ్ నుండి బయటపడే మార్గాలు వంటి అంశాలపై రాజమండ్రి జిల్లా ప్రభుత్వ ఆసుపత్రి సీనియర్ ఫిజీషియన్ డాక్టర్ చంద్రశేఖర్, కోవిడ్ సోకిన డయాబెటిక్ పేషెంట్లు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కార మార్గాలపై ప్రముఖ డయాబెటిక్ వైద్యులు డాక్టర్ కందుల సాయి ఉపన్యసిస్తారన్నారు. ఈ నెల 19వ తేదీ ఉదయం 10 గంటల నుండి 1 గంట వరకు జూమ్ యాప్ ద్వారా నేషనల్ వెబినార్ జరుగుతుందని తెలిపారు. అందరూ దీనిలో ఉచితంగా రిజిస్ట్రేషన్ చేసుకొని కోవిడ్ సందేహాలను నివృత్తి చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమాన్ని లైవ్‌లో నన్నయ న్యూస్ టీవీ యూట్యూబ్ ఛానల్ ద్వారా ప్రజలందరూ వీక్షించవచ్చని తెలియజేశారు. అందరూ దీన్ని సద్వినియోగం చేసుకొని కోవిడ్ నుండి అప్రమత్తంగా ఉండాలని వీసీ సూచించారు.




కోవిడ్ నేషనల్ వెబినార్ బ్రోచర్

# సంపాదకీయం



## పవిత్రమైన జీవితం

నీటిలోపడి తేలుపిల్ల మునిగిపోతుంది. ఆ నీటిలో నిలబడి ఉన్న వ్యక్తి ఆ తేలు పిల్లను రక్షించాలని అరచేతితో పైకి తీశాడు. అది కుట్టింది. ఆయన వదిలేశాడు. మళ్ళీ రక్షించే ప్రయత్నం. మళ్ళీ కుట్టటం ఇలా నాలుగైదు సార్లు జరిగింది. అరచేతి నిండా రక్తం. అది కుట్టటం, ఈయన రక్షించాలనే పంతం వదలడు. దారిన పోతున్న మరోవ్యక్తి ఇది చూసి అది కుడుతుంది కదా.. పోతే పోనీ.. వదిలేయ్.. అన్నాడు. " చిన్న తేలుపిల్ల. కుట్టటమనే తన స్వభావాన్ని అది వదులుకోనప్పుడు ఇంత మనిషిని కాపాడాలనే నా స్వభావాన్ని నేను ఎందుకు వదులుకోవాలి" అన్నాడు. ఎంత విచిత్రమైన సమాధానం. ఎవరాయన.. మహమ్మద్ ప్రవక్త!!

ధర్మాధర్మాలను ప్రబోధించిన ప్రవక్త ఆయన. ఒక సాధారణమైన జీవితాన్ని గడిపారు. కష్టించి పనిచేయటం చిన్నతనం కాదని స్వయంగా నిరూపించారు. తన జీవిత కాలంలోనే అరబ్బులందరిని సంఘటితపరిచి ఐకమత్యంగా ఉండటం నేర్పి వారిని ఒకటిగా చేర్చారు. శరీరంలో ఒక్కొక్క నాళంలో ప్రతి రక్తపు బిందువు ప్రాచీరేకలై భగవంతుని భక్తితో నిండిపోవాలని కోపతాపాలు, మోహాలు విడిపోయి పవిత్రమైన మానవునిగా జీవించాలన్నారు.


ముస్లిం సోదరులు భుజభుజాలు కలుపుకుంటూ ఆలింగనం చేసుకుంటారు. సర్వ మానవుల ప్రేమాలింగనం ఈ ప్రపంచానికి చాలా అవసరం. సేవించేవాడు, సేవింపబడేవాడు ఒక్కడే. భేదం లేదు. ధనిక పేద, చిన్న పెద్ద తేడాలేవీ లేకుండా మసీదులో అంతా దేవుని ముందు మోకరిల్లుతారు. ఇస్లాం నుంచి ఈ ప్రపంచం నేర్చుకోవాల్సింది ఇదే. సవ్యమైన విధానంలో ధనాన్ని సంపాదించాలని ప్రబోధించారు ప్రవక్త. పేచీలు లేని జీవితాన్ని గడపాలన్నారు. ముస్లింలకు కులభేదాలు లేవు. పూజ చేయటానికి ప్రతిమ లేదు. నిర్గుణమైన పరమాత్మను పూజించటం. భగవంతునితోనే ప్రత్యక్ష సంబంధం. జిహాద్ అంటే ఆత్మసాక్షాత్కారమే. తనను తానెరిగి ప్రవర్తించటమే. "బిస్మిల్లా హిర్రహమాను నిర్రహీం" నమాజులో ముఖ్యమైన మంత్రమిది. దివ్య ఖుర్ - ఆన్ ఆసాంతం మానవులకు మార్గదర్శకమైంది. అందులోని విశిష్టమైన బోధనలు ఋజుమార్గాన్ని చూపుతాయి. సత్యాసత్యాల వ్యత్యాసాన్ని విడమర్చి తెలుపుతాయి. 'హుదల్లిన్నస్' అంటే యావత్ మానవాళి మార్గదర్శక గ్రంథమని అర్థం.

రంజాన్ పర్వదినాల సమయంలో సమస్త మతధర్మాలు మానవాళి ఏకతకు, ప్రశాంతతకు, ప్రపంచ శాంతికి ఆధారం కావాలని సమాజం సమరస భావంతో వర్ధిల్లాలని ఆకాంక్షిద్దాం!!

# పుస్తకం



## ది మాంక్ హూ సోల్డ్ హిజ్ ఫెరారి




అమెరికాలో లాయర్‌గా పనిచేస్తున్న రాబిన్ ఎస్. శర్మ సెల్ఫ్ హెల్ప్ పుస్తకాన్ని ఒక కథలాగా చెప్తే ఎలా వుంటుందన్న ఆలోచన ఫలితమే ఈ "ది మాంక్ హూ సోల్డ్ హిజ్ ఫెరారి".

చాలా పెద్ద పేరున్న జూలియన్ మాంటిల్ అనే ట్రయల్ లాయర్ ఒకరోజు కోర్టు హాలులో గుండెపోటుతో విరుచుకు పడిపోవడంతో కథ మొదలవుతుంది. పని మాత్రమే ప్రపంచం. పనే దేవుడు. పనినే ప్రాణంగా భావించే జూలియన్ మాంటిల్ రెండు మూడు నెలలకు హాస్పిటల్ లో బతుకుజీవుడా అని ప్రాణాలతో బయటపడతాడు. కాని, మూడు నెలల్లోనే తన ఆస్తి, ఐశ్వర్యమూ సంపదా అన్నింటినీ పూచికపుల్లతో సహా అమ్మేస్తాడు. తనకంటూ ఏ వస్తువూ వుంచుకోడు. ఆఖరికి తన పడవలాంటి కారునో, కారులాంటి పడవనో కూడా అమ్మిపారేస్తాడు. ఆ తరువాత ఆశ్చర్యకరంగా ఈ ప్రపంచంనుండి అదృశ్యమైపోతాడు. ఎక్కడికి వెళ్లిపోయాడో తన ఆచూకీ ఎవ్వరికీ తెలీదు

పదిహేడు సంవత్సరాలుగా అతడితో కలిసి పనిచేస్తున్న జాన్ మనకీ కథంతా చెపుతుంటాడు. అలాంటి జాన్ దగ్గరకు ఒకరోజు సన్నగా, ఆరోగ్యంగా, చలాకీగా మెరుస్తోన్న కళ్లతో వ్ను ముప్పైఏళ్ల యువకుడు వచ్చి నేనే జూలియన్ మేంటిల్ నని చెప్తే కథకుడు నమ్మలేకపోతాడు. బానడు పొట్ట, ఊబ శరీరం, సగం పైబడిన వయస్సు ఎలా మాయమైపోయాయని ప్రశ్నల వర్షం కురిపించిన కథకుడికి వివరంగా రెండు వందల పేజీలలో చెప్పిన సమాధానమే ఈ నవల.

ఒత్తిడితో, విరామ మెరుగకుండా, యాంత్రికంగా మారిన జీవితంపై విముఖతతో ప్రశాంతతను వెతుక్కుంటూ బయలుదేరిన జూలియన్ వాళ్లూవీళ్లూ ఇచ్చిన సమాచారం మేరకు భారతదేశం చేరి హిమాలయాల దారి పడతాడు. ఆ మంచు ప్రర్వతశ్రేణులలో మహామునులను అన్వేషిస్తూ సాగించిన మహాప్రస్థానంలో శివానా పర్వతప్రాంతంలో కొంతమంది యోగులు కనిపించి జీవితసారాన్ని బోధిస్తారు. బహుశా ఈ సరికి మీకు అర్థమైపోయుంటుంది. ప్రాచీన భారతీయ జీవన విధానాన్ని రచయిత అత్యద్భుతంగా వర్ణించి వుంటాడని, అవును. నిజమే. ఈ పుస్తకం అమ్మకాలు, దీని తర్వాత రచయిత రాసిన పుస్తకాల వివరాలు జాగ్రత్తగా గమనించినట్లయితే, ముఖ్యంగా ఈ నవల ప్రచురణ తర్వాత రాబిన్ శర్మ తన న్యాయవాద వృత్తిని విడిచిపెట్టేసి, పూర్తిగా పబ్లిక్ స్పీకింగ్ వృత్తిలో స్థిరపడిపోయాడంటేనే మనం అర్థం చేసుకోవచ్చు. మన జీవనవిధానం పట్ల, మన తత్త్వం పట్ల పాశ్చాత్యులు ఎంత మక్కువ చూపిస్తున్నారో తెలుస్తుంది.

జీవితాన్ని ఏడు సూత్రాలతో ఆనందమయం చేసుకోవచ్చంటాడు రచయిత. మనసుపై అదుపు, గమ్యంపై అదుపు, కైజెన్ సాధన, క్రమశిక్షణతో బతుకు, కాలంపై అదుపు, నిస్వార్థ ప్రేమ, ప్రస్తుతాన్ని ప్రేమించు అనే ఏడు సూత్రాలు, ఒక్కో సూత్రంపై ధ్యానానికి ఒక్కో చిహ్నం, ప్రతి సూత్రమార్గంలో ప్రయాణించడానికి కొన్ని నిర్దిష్టమైన దారులు సూచిస్తాడు. చాలా ఆసక్తికరమైన సంభాషణలతో, పిట్ట కథలతో, ఉపదేశాలతో, సూక్తులతో సాగిపోయే రచన ఈ నవల. యువతరానికి ఎంతో ఉపయుక్తంగా వుంటుంది.

**- దుప్పల రవికుమార్**

# ఇస్లాం సందేశం



ఒకానొక మహిళ చేతిలో పళ్లెంలో ఏదో పదార్థాలు తీసుకెళుతుంది. పళ్ళెంపై గుడ్డ కప్పి ఉండటంతో పళ్ళెంలో ఏముందో తెలుసుకోవాలన్న కుతూహలం అటుగా వెళ్తున్న పండితునికి కలిగింది. అమ్మా! ఈ పళ్ళెంలో ఏముంది? అని అడిగారాయన. 'ఇందులో ఉన్నదేమిటో చెప్పదలుచుకున్నప్పుడు ఇలా కప్పి తీసుకెళ్లాల్సిన అవసరం ఏముంది' అని బదులు ఇవ్వటంతో పండితుడు సిగ్గుతో తలదించుకున్నాడు.

ఆమె చెప్పిన మాటలో జీవితానికి పనికొచ్చే చిట్కాలు ఉన్నాయి. ఏదైనా వస్తువు, మాట రహస్యంగా ఉంచదలచినప్పుడు దాన్ని బహిర్గతం చేసే ప్రయత్నం చేయకూడదన్న నిగూడార్థం ఇందులో ఉంది. ఒకరి వెంటపడి వారి లోపాలను, బలహీనతలను బహిర్గతం చేయరాదనే సందేశం కూడా ఇందులో ఉంది.

ప్రతి ఒక్కరిలోనూ మంచి, చెడు అలవాట్లు ఉంటాయి. మనం మన లోపాల్ని ఒకరు ముందు బహిర్గతం కాకుండా జాగ్రత్త పడతాం. పైనున్న ఆ దేవుడు మనలోని ఆ దుర్గుణాలపై పరదా కప్పి మన గౌరవ మర్యాదలను కాపాడుతాడు. ఒకవేళ అంతరంగంలో మనం చేసే తప్పులు, పొరపాట్లు, చెడ్డ పనులు అన్నీ బహిర్గతమైతే ఒకరినొకరు అసహ్యించుకుంటారు. అందుకే ఒకరి లోపాలు అదేపనితో వెతుక్కుంటూ, వారిని అభాసుపాలు, అవమానించే చిల్లర పనులు మానుకోవాలని అంటారు పెద్దలు.

**- ఖైరున్నీసా బేగం.**


## మంచి మాట

**విజేత వెనుక ఉండేది అదృష్టమో, మంత్ర దండమో కాదు. చక్కని ప్రణాళిక, కఠోర శ్రమ, అంకితభావం.**




# వెండితెర నవ్వులరేడు చార్లీ చాప్లిన్

**(16.4.1889 - 20.12.1977)**



**ప్రతిభా వాణి**

తను నటించిన చిత్రాల ద్వారా ప్రపంచాన్నంతటినీ నవ్వించి విశ్వవిఖ్యాతి గాంచిన నవ్వుల రేరాజు ఛార్లెస్ స్పెన్సర్ చాప్లిన్. బ్రిటన్లో పుట్టిబీ అమెరికాలో చలనచిత్రాలు నిర్మించిబీ చివరికి కమ్యూనిస్ట్ గా ముద్రపడి అమెరికా నుండి వెలివేయబడిన చాప్లిన్ కి బెర్లిన్ లో ప్రపంచ శాంతి బహుమతి దక్కింది.

ఛార్లెస్ స్పెన్సర్ చాప్లిన్ బ్రిటిష్ పౌరుడు. చార్లీ చాప్లిన్ కెన్సింగ్టన్ పట్టణంలో జన్మించాడు. తండ్రి సీనియర్ చాప్లిన్, తల్లి లిల్లీ హార్లీ. తల్లి మొదటి భర్త సంతానం సిడ్నీ కూడా చాప్లిన్ వెంటే పెరిగాడు. చాప్లిన్ తల్లిదండ్రులు చిన్న చిన్న వినోద ప్రదర్శనలు ఇచ్చేవారు. అందులో తల్లి పాత్ర పాటలు పాడి ప్రేక్షకుల్ని రంజింపజేయడం. తండ్రి మాత్రం మద్యానికి బానిస. సంపాదించిన డబ్బును తాగి తగలేసేవాడు. తల్లిదండ్రుల వినోద ప్రదర్శనలకు చాప్లిన్ కూడా వెళ్ళేవాడు. ఒకసారి తల్లి అనారోగ్యంతో స్టేజి మీద పాడలేక పోతే, తండ్రి చాప్లిన్ ని ముందుకు తోసి పాడమన్నాడు. అప్పుడు చాప్లిన్ వయసు ఐదు సంవత్సరాలే! జాక్ జోన్స్ అనే పాట చాప్లిన్ పాడుతుంటే డబ్బుల వర్షం కురిసింది. తాగుడుకి బానిసై తండ్రి మరణించడంతో, చాప్లిన్ తల్లి పేదవాళు నివసించే కాలనీకి మకాం మార్చింది. అందుకు కారణం ప్రపంచ యుద్ధం జరిగినప్పుడు హిట్లర్ విమాన బాంబ్ లతో దాడి జరిపి కూల్చివేసిన వాటిల్లో చాప్లిన్ ఇల్లు కూడా ఒకటి కావడమే! తల్లి సలహాతో చాప్లిన్ హన్వేల్ స్కూల్ హాస్టల్ లో చేరాడు. అప్పుడు ఏడేళ్ళ వయసులో వున్న చాప్లిన్ కి మ్యూజిక్ హాల్స్ లో ప్రదర్శించే డాన్సుల్లో పాల్గొనే అవకాశం దొరికింది. తరవాత చాప్లిన్ విద్యాభ్యాసం లండన్ కి సమీపంలోని హెర్న్ బాయ్స్ స్కూల్ లో కొనసాగింది.

కాలక్రమంలో అన్న సిడ్నీ ఆఫ్రికా వెళ్లిపోయాడు. తల్లి ఆసుపత్రి పాలయ్యింది. ఈ దుర్భర పరిస్థితుల్లో చాప్లిన్ వీధి నృత్యాలు చేసాడుబీ లుడ్ గేట్ సర్కస్ లో కాగితం పడవలు అమ్మాడు. క్షురశాలలో పనిచేసాడు. పార్కుల్లో పడుకున్నాడు. ఈ అనుభవాలన్నీ తన 'కిడ్' చిత్రంలో చూపించాడు చాప్లిన్. అలా కష్టపడుతూ చాప్లిన్ తన పదో ఏట మొదటి స్టేజి నాటకాన్ని లండన్ హిపో డ్రోమ్ థియేటర్ లో ప్రదర్శించాడు. ఆ నాటకం పేరు 'గిడీ ఓస్టేండ్'. మంచి నటుడిగా చాప్లిన్ కి పేరొచ్చింది. చేతుల్లో డబ్బూ చేరింది. కానోన్ డోయల్ నవల 'షెర్లాక్ హెూమ్స్'ని నాటకంగా ప్రదర్శిస్తే అందులో బిల్లి అనే ఆఫీస్ బాయ్ పాత్రను చాప్లిన్ పోషించేవాడు. ఈ ప్రదర్శనలెన్నిసార్లు ఇచ్చారో చెప్పలేం. ఇలా వుండగా 'కేసీజ్ కోర్ట్ సర్కస్' అనే హాస్య నాటికలో చాప్లిన్ కు నటించే అవకాశం వచ్చింది. ఈ నాటకం తరవాతే చాప్లిన్ హాస్య నటుడిగా రూపాంతరం చెందాడు. ఛానల్ దీవుల్లో ఒకసారి చాప్లిన్ నటిస్తున్నాడు. అతని హాస్య సంభాషణలకు జనం నవ్వడం లేదు. కారణం అక్కడి ప్రేక్షకులకు ఇంగ్లీష్ భాష రాదు. అప్పుడే చాప్లిన్ కి ఓ ఐడియా వచ్చి మూకాభినయం (పాంటో మైమ్) తో వారిని నవ్వించాడు. ఆ తరవాత మూకాభినయమే చాప్లిన్ కి ఒక వరమయ్యింది.

ఆఫ్రికాకు వెళ్ళిన అన్న సిడ్నీ చాప్లిన్ (సిడ్) కూడా స్టేజి నటుడై ఫ్రెడ్ కార్నో కంపెనీలో పనిచేస్తూ తమ్ముడు చార్లీ చాప్లిన్ కి అవకాశాలు ఇప్పించాడు. ఈ కంపెనీ వారు 'జియో, ది ఫియర్లెస్' అనే నాటకంలో ప్రధాన పాత్రకు చార్లీ చాప్లిన్‌ను ప్రతిపాదిస్తే చాప్లిన్ కి ధైర్యం చాలక వదులుకున్నాడు. లారెల్ హార్డీ జంటలో ఒకరికి ఈ పాత్ర ధరించే అదృష్టం కలిగింది. మళ్లీ కష్టపడి ఎలాగో ఆ పాత్రని చార్లీ చాప్లిన్ రాబట్టుకున్నాడు. ఈ సమయంలోనే చార్లీ చాప్లిన్ హెటీ కెల్లీ అనే నటితో ప్రేమలో పడ్డాడు. అప్పుడు చాప్లిన్ కి పట్టుమని పందొమ్మిదేళ్ళు. కానీ హెటీ కెల్లీ చాప్లిన్ ని కాదని ఓ ధనవంతుణ్ణి పెళ్ళాడింది. ఈ సంఘటన జరిగినప్పుడు చాప్లిన్ అమెరికాలో వున్నాడు. చాప్లిన్ ఈ విషయం గురించి చింతించలేదు. తన భవిష్యత్తుపై దృష్టి నిమగ్నం చేసాడు. చాప్లిన్ మొదటి చలన చిత్రం 'మేకింగ్ ఎ లివింగ్' అనే ఒక రీల్ చిత్రం. 1914లో ఈ చిత్రం విడుదలై విజయాన్ని సాధించింది. తన రెండో చిత్రం 'కిడ్ ఆటో రేసెస్ ఎట్ వెనిస్' లో చాప్లిన్ ఆర్బకిల్ ప్యాంటు, చాలీ చాలని కోటు, బౌలర్ టోపీ, లూజు బూట్లు, గొంగళి పురుగు మీసాలు, చేతిలో కర్ర తో నటించాడు. ఇది ప్రేక్షకులకు ఎంతో నచ్చింది. ఇదే ఆహార్యంతో దాదాపు 70 చిత్రాల్లో చాప్లిన్ తదనంతర కాలంలో నటించడం జరిగింది. మూడో చిత్రం 'మేబెల్స్ స్ట్రేంజ్ ప్రెడి కామెంట్' లో పరిగెత్తుతూ మలుపు తిరిగినప్పుడు, టోపీ చేతిలో పట్టుకుని, ఒక కాలు పైకెత్తి రెండో కాలు మీద జారుతూ నటించాడు. ఈ విద్యకు చాప్లిన్ ప్రేక్షకుల నీరాజనాలు అందుకున్నాడు. చాప్లిన్ 35 లఘు చిత్రాలు, ఒక పెద్ద చిత్రంలో నటించాడు. చాలావరకు ఆ చిత్రాలను చాప్లిన్ స్వయంగా డైరెక్ట్ చేసాడు. ఎసేనే కంపెనీ కి 14 చిత్రాలు చేసాడు. చిత్రాల్లో కొత్త అంశాలు జొప్పించడమే కాకుండా కరుణ రసం, వ్యంగ్యం, సౌండ్ ఎఫెక్ట్స్ ప్రవేశపెట్టి చిత్రాలు విజయవంతంగా నడిచేందుకు శ్రమించాడు చాప్లిన్. 'ఎ వుమన్', 'కార్మెన్' 'ది బ్యాంక్' చిత్రాలు ఇందుకు ఉదాహరణలు. 'ది ట్రాంప్' చిత్రం చాప్లిన్ నటించిన గొప్ప క్లాసిక్ గా నిలిచింది. చార్లీ ఇందులో తిరుగుబోతు పాత్రను ధరించాడు. ఇందులో చార్లీ ఒక అమ్మాయిని దొంగలబారినుండి రక్షిస్తాడు. ప్రతిగా ఆ పిల్ల తండ్రి చార్లీ కి ఉద్యోగం ఇస్తాడు. ఆ పిల్ల ప్రేమలో పడిన చార్లీ కి ఆమె ప్రియుడు ప్రవేశంతో ఉద్వేగానికి గురై దూరంగా వెళ్ళిపోతాడు. అలా చిత్రం ఫేడ్ అవుట్ అవుతుంది. ప్రేక్షకుల్ని ఈ చిత్రం విశేషంగా ఆకర్షించింది. చాప్లిన్ కోసం చాలా సినిమా కంపెనీలు పోటీ పడ్డాయి.

ఆనాటి అమెరికా అధ్యక్షుడు ఉడ్రో విల్సన్ శ్వేత సౌధంలో చాప్లిన్ కి స్వాగతం పలికాడు. చాప్లిన్ స్విట్జర్లాండ్ లోని జెనివాలో స్థిరనివాసం ఏర్పరచుకున్నాడు. 1977డిసెంబర్ 20న చాప్లిన్ జీవన రంగస్థలం నుండి నిష్క్రమించాడు. ఆ మహానటునికి అక్షర నీరాజనం!!

**- ఆచారం షణ్ముఖాచారి**

# మహిళలపై కోవిడ్-19 ప్రభావం

కరోనా మహమ్మారి కారణంగా స్త్రీ, పురుషుల మధ్య అసమానతలు పెరిగాయి. మహమ్మారి పురుషుల కంటే, మహిళలపై ఎక్కువ ప్రతికూల ప్రభావాన్ని చూపింది. మహిళలు అధిక రేటులోఉద్యోగాలు కోల్పోతున్నారు. అంతర్జాతీయ కార్మిక సంస్థ ప్రకారం పురుషులలో 3.9 శాతంతో పోలిస్తే మహిళల్లో 5 శాతంగా ఉంది. కరోనా మహమ్మారి భూగోళాన్ని చుట్టుముట్టక దాదాపు అన్ని దేశాలలో అన్ని రంగాలు దెబ్బతిన్నాయి. మన దేశంలో అయితే అంతో ఇంతో సాధించిన అభివృద్ధి కాస్త వెనక్కి వెళ్ళింది. కరోనా పంజా అనంతరం విధించిన లాక్ డౌన్ కారణంగా అన్ని రకాల పరిశ్రమలు మూతబడి అందరికీ ఉపాధి దెబ్బతింది. కానీ ఈ ధోరణి స్త్రీ, పురుషులు సమానంగా లేదు. పురుషులలో కంటే మహిళల ఉపాధి అవకాశాలే తీవ్రంగా దెబ్బతిన్నాయి. కరోనా వైరస్ మహమ్మారి అన్నిరంగాల్లోనూ మహిళలపై తీవ్రమైన ప్రభావం చూపింది. ఇప్పటివరకు ఉన్న అసమానతలను కోవిడ్-19 మరింత తీవ్రం చేసింది. ఈ అంతరాలను పూడ్చడం తో పాటు మహిళా సాధికారతకు విలువ ఇవ్వటం ద్వారా సుస్థిర అభివృద్ధిని సా ధి ం చ గ లు గు తా వు ు. మహమ్మారి ప్రాథమికంగా కార్యాలయంలో మరియు ఇంటిలోనూ లింగ సమానత్వాన్ని ప్రభావితం చేసింది. సంవత్సరాల పురోగతిని వెనక్కి తీసుకుంది. భవిష్యత్ ఆర్థిక వ్యవస్థను మనం కోరుకుంటే రేపటి ఉద్యోగాల్లో మహిళలకు ప్రాతినిధ్యం వహించడం చాలా అవసరం. ఎందుకంటే మన దేశంలో మహిళలు ఇప్పుడిప్పుడే అభివృద్ధి పథం వైపు నడుస్తున్నారు. దేశంలో కరోనా విజృంభిస్తు ప్రజల ఉపాధి మరియు ఉద్యోగాలను కోల్పోయేలా చేసింది. దీనిలో అధిక శాతం మహిళలే ఉన్నారు. లింగ సమానత్వాన్ని ప్రాథమిక హక్కుగా పరిగణించాలి. అన్ని రంగాల్లో నూ మహిళలకు ప్రాధాన్యం ఇవ్వాలి. ఇందుకు అవసరమైన చట్టాలను పాలకులు రూపొందించాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉంది.

**-ఏ.జే. ఎస్. దీప్తి**
M.A,(Pol.sci)
**ఆదికవి నన్నయ యూనివర్సిటీ**
**బి.ఎడ్ సెకండ్ ఇయర్**

**కవితా కాలం**

## సమయంలేదు మిత్రమా !

ఎవర్ని నిందించి ప్రయోజనం లేదు!
నేలతల్లిని ధ్వంసం చేసుకున్నాక
పొగగొట్టాలను ఇష్టారాజ్యంగా
భూమిలో పాతేసుకున్నాక
నదీగర్భాలను విచ్ఛిన్నం చేసుకున్నాక
ఆకాశమార్గాలను చిత్తడి చేసుకున్నాక
ఎవర్ని వేలెత్తి చూపిస్తే ఒరిగేదిలేదు!
పంటలు చేతికొచ్చాయిగాని
ఫలసాయం అమ్ముకునే మార్గం లేదు!
మామిడికాయలు కుళ్ళుతున్నాయ్!
వేరుశనగ భూమిలోనే సమాదౌతున్నాయ్!
ప్రత్తికాయలు చేలోనే భళ్ళున పగులుతున్నాయ్!
మిర్చి కోతలు మందగించాయి!
ఆక్వారంగం కుదేలయింది!
అయినా ఇప్పుడేడ్చి ఫలితం లేదు!
బాధంతా దినసరి కూలీలదే!
చిరు వ్యాపారులదే!
కష్టం చేయలేక ఇతరులపై ఆధారపడ్డవారికే!
కంపుకట్టే మనిషి ఆలోచనలకు
కరోనా చావుదెబ్బ కొట్టింది!
కనిపించని దొంగదెబ్బ తీసింది!
నూరుగొడ్లు తిన్న రాబందు
ఒక్క గాలిపెట్టుకు చచ్చినట్టు
ప్రపంచాన్ని శాసించొచ్చు అనుకున్నవారి
మెడలువంచి మర్యాద చేసింది!
పచ్చని ప్రకృతి కావాలో
అర్థాంతర జీవితం కావాలో తేల్చుకో!
ఆధిపత్యం కావాలో అందలం కావాలో ఆలోచించుకో!
సమయంలేదు మిత్రమా!
మహమ్మారితో రణమా! మరణమా! నిర్ణయించుకో!

(కరోనా చేస్తున్న భీభత్సం
తలచుకుని బాధతో)

**- డా.గూటం స్వామి, రాజమహేంద్రవరం.**

## కాపాడేది ఎవరు?

కడతేరి పోతుందన్న కరోనా సర్పం,
ప్రజలు నిర్లక్ష్యంతోపునరుద్ధానం పొంది, ఊపిరి తీస్తోంది.
నివురుగప్పిన కరోనా, తిరిగి ప్రజ్వలించి
జీవితాల్ని బుగ్గి చేస్తోంది.
పుణ్యాత్ముడు, పాపాత్ముడు పేద, గొప్ప తారతమ్యం చూపక,
ప్రేతవనానికి చేర్చు తోంది.
కరోనాను కడతేర్చు చిట్కాలు, ఔషధాలు, ఆహారాలెన్నో
బలోపేతమొనర్చేవి ఉన్నా ప్రజల అలసత్వం ఫలితం
ప్రాణాల్ని బలి పెట్టడం.
సంబరాలు, పెళ్లిళ్లు, కుంభమేళాల వేడుకల్లో రెచ్చిన
కరోన రక్కసి దెబ్బకు కన్ను మూస్తున్నారు.
మాస్కులు ధరించమని, భౌతిక దూరం పాటించమని,
చేతుల్ని పరిశుభ్రపరచుకోమని విస్తృతంగా ప్రచారం
చేసినాబీ తిరస్కరించి కోల్పోతున్నారు విలువైన ప్రాణాల్ని.
దేవాలయాలు, చర్చిలు, మసీదుల ద్వారాలు
మూతపడ్డాయి.
ఏ దేవుడూ రక్షించడానికి రాడని తేలిపోయింది.
వితరణశీలురెందరో బాధితులకు విరాళములు ఇచ్చి,
మానవత్వాన్ని చూపారు.
ప్రాణప్రతిష్ఠగావిస్తున్న వైద్య విధాతలు, నర్సుల చల్లని
స్పర్శలు, రక్షకభటుల కృషి, పారిశుద్ధ్య కార్మికుల
అంకితభావం కరోనా వైరస్ నుంచి కాపాడాయి. ప్రాణాల్ని
పణంగా పెట్టి శత్రు పోరాటంలో ఎందరో అసువులు
బాశారు.
మిత్రమా! మనకోసం వెలసిన దేవుళ్లను రక్షించుకుందాం
మన భవిష్యత్తు భద్రతకై పాటుపడిన మహానుభావులకు
ప్రణమిల్లుదాం.
స్వీయ నియంత్రణ శ్వాస నిలుపుతుందన్న వారి సందేశాన్ని
విశ్వసిద్దాం. ధర్మ బద్ధులమై సాగుదాం.

**- మల్లెమొగ్గల గోపాలరావు,**
**రాజమహేంద్రవరం.**



**కె.లావన్ రెడ్డి**
**ఎం.ఎ**
**ఎకనామిక్స్**

దగ్గుతోడమొదలు దయలేనిది కరోన
ఒళ్ళు నొప్పిదెచ్చు కుళ్ళు క్రిమియు
జలుబునలతగూడి జ్వరమునదికమౌ
మనసుధైర్యమిపుడు మనకురక్ష!!

**- తాళ్లపల్లి భాగ్యలక్ష్మి(టీచర్),**
**రాజన్న సిరిసిల్ల జిల్లా.**

# ఆన్‌లైన్ క్లాసులపై వీసీ దిశా నిర్దేశం

**13.05.21 (మీడియాసెల్)**

ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం రాజమహేంద్రవరం, కాకినాడ, తాడేపల్లిగూడెం క్యాంపస్‌లోని ప్రత్యేక అధికారులు, ప్రిన్సిపాల్స్, విభాగాల అధిపతులు, కోర్సు కోఆర్డినేటర్లతో వీసీ ఆచార్య మొక్కా జగన్నాథరావు ఆన్‌లైన్ సమీక్ష సమావేశాన్ని నిర్వహించి దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ కోవిడ్ వంటి విపత్కర పరిస్థితుల్లో కూడా విద్యార్థులకు అవసరమైన విజ్ఞానాన్ని అందించడంలో అధ్యాపకులు ముందుండాలని అన్నారు. అధ్యాపకులంతా ఆన్‌లైన్ పాఠ్యాంశాలను పూర్తిస్థాయిలో సమర్థవంతంగా నిర్వహించాలని తెలియజేశారు. విద్యార్థుల హాజరు, పాఠ్యాంశాల వివరాలు, అసైన్మెంట్లు తదితర అంశాలను ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ ఉండాలన్నారు. సాంకేతిక ఇబ్బందులు తలెత్తుతున్న విద్యార్థులకు ఈ-కంటెంట్ రూపంలో పాఠ్యాంశాలను అందించాలని చెప్పారు. కోవిడ్ జాగ్రత్తలను సూచిస్తూ విద్యార్థుల్లో ఉన్న భయాందోళనలు పారద్రోలి అధ్యాపకులు సైకలాజికల్ కౌన్సిలింగ్ ను అందిస్తూ విద్యార్థులకు భరోసాగా నిలవాలని తెలియజేశారు. కేవలం పాఠ్యాంశాలు మాత్రమే కాకుండా పరిశోధనా పత్రాలను, పుస్తకాలు రాయడం మరియు ప్రాజెక్టులకు ప్రణాళికలు సిద్ధం చేయడం వంటి విద్యాపరమైన కార్యక్రమాలను నిర్వహిస్తుండాలని సూచించారు. ప్రతి శనివారమూ ఆయా విభాగాలలో నిష్ణాతులైన ఆచార్యులు శాస్త్రవేత్తలు గెస్ట్ లెక్చర్ ఆన్‌లైన్ ద్వారా నిర్వహించాలని చెప్పారు. అన్ని విభాగాలూ ఆన్‌లైన్ వెబినార్లను నిర్వహించి విజ్ఞానాన్ని వికసింపజేయాలన్నారు. విద్యార్థులకు నిత్యం అధ్యాపకులు ఆన్‌లైన్లో అందుబాటులో ఉండాలని, సందేహాలను నివృత్తి చేస్తూ మంచి విద్యావంతులుగా వారికి మార్గ నిర్దేశం చేయాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య టి.అశోక్, ప్రత్యేక అధికారులు, ప్రిన్సిపాల్స్, విభాగాల అధిపతులు, కోర్సు కోఆర్డినేటర్లు పాల్గొన్నారు.




ఆన్‌లైన్ క్లాసుల సమీక్షలో మాట్లాడుతున్న వీసీ

## విద్యార్థులకు గెస్ట్ లెక్చర్లు అందిస్తాం

తాడేపల్లిగూడెంలో ఫార్మసి, ఆర్గానిక్ ఎనలిటికల్ కెమిస్ట్రీ, కామర్స్ వంటి కోర్సులు ఉన్నాయి. టైం టేబుల్ ప్రకారం ఆన్ లైన్ క్లాసులు నిర్వహిస్తున్నాం. 70 శాతం విద్యార్థులు ఆన్ లైన్ తరగతులకు హాజరు అవుతున్నారు. అన్ లైన్ క్లాసులకు హాజరు కాలేని విద్యార్థులకు రికార్డెడ్ క్లాసులను అందిస్తున్నాం. వీసీ సూచించినట్లు ఆయా విభాగాల్లో నిష్ణాతులైన వారి ద్వారా గెస్ట్ లెక్చర్లు అందిస్తాం. మెయిన్ క్యాంపస్ లోని అధ్యాపకులతో ఆన్ లైన్ పాఠ్యాంశాలను విద్యార్థులకు అందిస్తాం. వీసీ సమీక్ష ద్వారా మంచి ఫలితాలు వస్తాయని ఆశిస్తున్నాం.

**ఆచార్య కొట్టి శ్రీరమేష్, ప్రత్యేకాధికారి, తాడేపల్లిగూడెం క్యాంపస్**

## పరిశోధనకు, ప్రాజెక్టులకు ప్రాధాన్యతనిస్తున్నాం

ఆన్ లైన్ క్లాసుల ద్వారా పాఠ్యాంశాలను పూర్తి చేసాం. వీసీ తెలియజేసినట్లు పరిశోధనలకు, ప్రాజెక్ట్ ప్రతిపాదనలకు ప్రాధాన్యతనిస్తున్నాం. ఆన్ లైన్ క్లాసులు ప్రారంభించడానికి ముందే కొన్ని ల్యాబ్ ప్రాక్టికల్స్ పూర్తి చేసాం మరికొన్ని పెండింగ్‌లో ఉన్నాయి త్వరలో వాటిని పూర్తి చేస్తాం. విద్యార్థులకు అవసరమైన విజ్ఞానాన్ని అందించడానికి ఉన్న ఆన్ లైన్ మార్గాలను పూర్తి స్థాయిలో వినియోగించుకుంటున్నాం. వాట్సప్, గూగుల్ మీట్, జూమ్ యాప్ లు, వెబ్ సైట్ వంటి అన్ని సాంకేతిక సాధనాలతో విజ్ఞానాన్ని వికసింపచేస్తున్నాం.

**డా.కె.రమణేశ్వరి, ప్రిన్సిపాల్,**
**యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ**

## 3 గంటల సమీక్షతో వీసీ ఆత్మస్థైర్యాన్ని నింపారు

క్యాంపస్‌ల ప్రత్యేకాధికారులు, కళాశాలల ప్రిన్సిపాల్స్, విభాగాధిపతులు, కోర్సు కోఆర్డినేటర్లతో వీసీ 3 గంటల సేపు సుదీర్ఘ సమీక్షను నిర్వహించారు. కోవిడ్ వంటి విపత్కర పరిస్థితుల్లో విశ్వవిద్యాలయ అధికారుల్లోను, అధ్యాపకులలోను ఆత్మస్థైర్యాన్ని నింపడానికి ఈ సమీక్ష ఎంతో ఉపయోగపడింది. ఆన్ లైన్ క్లాసులపై ప్రతి ఒక్కరితోనూ వీసీ మాట్లాడి సూచనలు, సలహాలు ఇచ్చారు. అవి విశ్వవిద్యాలయాన్ని విజ్ఞానపరంగా అభివృద్ధి చేయడానికి ఎంతో ఉపయోగపడతాయని భావిస్తున్నాం. విద్యార్థుల సందేహాలను నివృత్తి చేయడంలో అధ్యాపకులు ముందుండాలని కష్టకాలంలో వారికి భరోసాగా నిలవాలని వీసీ సూచించడం విద్యార్థుల పట్ల ఉన్న శ్రద్ధను తెలియజేస్తుంది.

**ఆచార్య టి.అశోక్,**
**యూనివర్సిటీ రిజిస్ట్రార్**

## ఆన్‌లైన్ క్లాసులను ఛాలెంజ్‌గా తీసుకున్నాం

కోవిడ్ కారణంగా ప్రతికూల పరిస్థితులు ఏర్పాడినప్పటికీ ఆన్‌లైన్ క్లాసులు నిర్వహించడాన్ని ఛాలెంజింగ్ గా తీసుకుంటున్నాం. సాంకేతిక సమస్యలతో ఆన్ లైన్ క్లాసులకు దూరమవుతున్నవారికి లెర్నింగ్ మేనేజ్మెంట్ సిస్టమ్ ద్వారా ఈకంటెంట్‌ను అభివృద్ధి చేస్తున్నాం. ఉభయగోదావరి జిల్లాల్లోని అనుబంధ కళాశాలలు తమ అధ్యాపకులను పూర్తి స్థాయిలో వినియోగించుకోవాలని సూచించాం. కోవిడ్ వంటి పరిస్థితుల్లో కళాశాలల యాజమాన్యాలు అధ్యాపకులను తొలగించకుండా వారి విజ్ఞానాన్ని సమర్థవంతంగా విద్యార్థులకు అందించాలనే సర్క్యులర్‌ను విడుదల చేసాం.

**డా.ఎం.కమలకుమారి,**
**ప్రత్యేకాధికారి, కాకినాడ క్యాంపస్**

## 80 శాతం పైగా విద్యార్థులు హాజరవుతున్నారు

ఈ సమీక్షలో వీసీ అందరినీ అడ్రస్ చేసారు. విద్యార్థులకు అవసరమైన అన్ని అంశాలను ఆయన ప్రస్తావించి సూచనలు, సలహాలు అందించి మార్గనిర్ధేశం చేసారు. ఆన్ లైన్ క్లాసులకు 80 శాతానికి పైగా ఇంజనీరింగ్ విద్యార్థులు హాజరవుతున్నారు. ఆయా కారణాలతో హాజరు కాని విద్యార్థులకు రికార్డింగ్ పాఠ్యాంశాలను పంపుతున్నాం. వీసీ సూచన మేరకు కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ క్లబ్స్ ద్వారా ఈవెంట్లు నిర్వహించేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నాం. ఇంజినీరింగ్ విద్యార్థులు సాంకేతిక పరిజ్ఞానాన్ని మరింత ప్రయోజనకరంగా వినియోగించుకోవాలని అధ్యాపకుల ద్వారా తెలియజేస్తున్నాం.

**డా.వి.పెర్సిస్, ప్రిన్సిపాల్, యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్**

## వీసీ వ్యూహాత్మక ప్రణాళికలు మంచి ఫలితాలనిస్తాయి

భయానక పరిస్థితుల్లో వీసీ వ్యూహాత్మక ప్రణాళికలు విజ్ఞానపరంగా మంచి ఫలితాలను ఇస్తాయని ఆశిస్తున్నాం. అన్ని విభాగాలు పాఠ్యాంశాల బోధనతో పాటు వెబినార్లు నిర్వహించాలని సూచించారు. మేనేజ్మెంట్ విభాగం నుండి అంతర్జాతీయ స్థాయిలో వెబినార్ ను నిర్వహించేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నాం. కోవిడ్ కారణంగా అధ్యాపకులకు, విద్యార్థులకు మధ్య దూరమైన విద్యాపరమైన సంబంధం ఆన్‌లైన్ ప్లాట్ ఫారం ద్వారా దగ్గరైంది. విద్యార్థులకు మానసిక ధైర్యాన్ని చెప్పడానికి అధ్యాపకులు ముందుండాలని వీసీ సూచించారు. ఆర్ట్స్ కళాశాల నుండి సైకాలజీ విభాగం అందిస్తున్న సైకలాజికల్ కౌన్సిలింగ్ మంచి స్పందన వస్తుంది.

**ఆచార్య ఎస్.టేకి, ప్రిన్సిపాల్,**
**యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ ఆర్ట్స్ అండ్ కామర్స్**

## వెబినార్ల నిర్వహణకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నాం

ఆన్ లైన్ సమీక్షలో వీసీ సూచించినట్లు వెబినార్లు నిర్వహించి ఆయా రంగాల్లో నిష్ణాతుల ద్వారా మంచి ఉపన్యాసాలు అందిస్తాం. ఎడ్యుకేషన్, ఫిజికల్ ఎడ్యుకేషన్ కళాశాలకు సంబంధించిన పాఠ్యాంశాలను ఆన్‌లైన్‌లో అందిస్తున్నాం. ఆన్‌లైన్ క్లాసులు ప్రారంభించడానికి ముందే మెటీరియల్‌ను విద్యార్థులకు అందించాం. వాటి ఆధారంగా ఇప్పుడు ఆన్‌లైన్ తరగతుల నిర్వహణ సులభతరం అవుతుంది. ఆన్ లైన్ క్లాసుల నిర్వహణపై రిపోర్టును ప్రతివారమూ యూనివర్సిటీ రిజిస్ట్రార్‌కు సమర్పిస్తున్నాం. వీసీ సూచనలు, సలహాలు పాటిస్తూ విద్యార్థులకు మరింత విజ్ఞానాన్ని అందించేందుకు ప్రయత్నిస్తాం.

**డా.కె.సుబ్బారావు, ప్రిన్సిపాల్,**
**యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ ఎడ్యుకేషన్**

ప్రచురణ : మీడియా సెల్, ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం-రాజమహేంద్రవరం, ఈమెయిల్ :- nannayavani@aknu.edu.in